అక్రమ కట్టడాల జాబితాలో ఉన్న జీ వివేక్ ఫామ్‌హౌస్

కేవీపీ ఫామ్‌హౌస్

చెరబట్టింది వీరే.. చర్యలేవీ?

హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్-బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాల గుట్టురట్టు
కేవీపీ, వివేక్‌తో పాటు భారీ ఎత్తున నిర్మాణాలు చేపట్టిన శ్రీనిధి విద్యా సంస్థ
పలువురు ప్రముఖులు సహా 83 అక్రమ నిర్మాణాలను గుర్తించిన జలమండలి
ప్రభుత్వంలోని పలువురు పెద్దల నిర్మాణాలను విస్మరించిన అధికారులు
గండిపేట ఎఫ్‌టీఎల్‌లో కొరడా ఝుళిపించిన హైడ్రా.. వీటిపై మౌనమేల?

హైదరాబాద్ సిటీబ్యూరో/మణికొండ, అక్టోబరు 29 (నమస్తే తెలంగాణ): స్వచ్ఛమైన మంచినీటికి ఆలవాలమైన హిమాయత్‌సాగర్ రిజర్వాయర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల తేడా లేకుండా సంపన్న వర్గాలు ఎకరాల కొద్దీ కబ్జా చేసి విలాసవంతమైన నిర్మాణాలు చేపట్టారు. వాస్తవానికి ఈ ఆక్రమణలు, ఫాంహౌస్ సంస్కృతి అనేది దాదాపు నాలుగైదు దశాబ్దాల క్రితమే మొదలైంది. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో విచ్చలవిడిగా ఈ రిజర్వాయర్ పరిధిలో నిర్మాణాలు జరిగాయనేది జగమెరిగిన సత్యం. కాంగ్రెస్ నేతలకే ఎక్కువ సంఖ్యలో ఇక్కడ ఫాంహౌస్‌లు ఉన్నాయనేది కూడా ప్రతి ఒక్కరికీ తెలిసిందే. కానీ, తాజాగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రాత్రికి రాత్రి ఈ ఫాంహౌస్‌లు వెలిసినట్టుగా వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రతి సమావేశంలోనూ ఈ అంశాన్ని ప్రస్తావించి 'కూలగొడదామా?' అని సవాళ్లు విసిరిన సందర్భాలు అనేకం. ఈ నేపథ్యంలో హిమాయత్‌సాగర్ రిజర్వాయర్ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో గత నెల మొదటి వారంలో హిమాయత్‌సాగర్, అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ, బాకారం, నర్కుడ, కొత్వాల్‌గూడ ప్రాంతాలలో జలమండలి అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో సరిహద్దు రాళ్లు ఎక్కడ ఉన్నాయి? వాస్తవికంగా హద్దులు ఎక్కడిదాకా ఉన్నాయి? వాటి పరిధుల్లో ఎన్ని నిర్మాణాలు ఉన్నాయి? అవి ఎవరివి? అనే వివరాలతో నివేదిక రూపొందించారు.

శ్రీనిధి ఫామ్‌హౌస్

నెల దాటినా చర్యలేవి?

జలమండలి అధికారుల నివేదిక ప్రకారం హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో 83 అక్రమ నిర్మాణాలు ఉన్నట్టు నివేదికలో పొందుపరిచారు. ఈ నివేదికను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమర్పించారు. అంటే సీఎం చైర్మన్‌గా ఉన్న హైడ్రాకు కూడా ఈ నివేదిక వెళ్లిందనేది సుస్పష్టం. విచిత్రమేమిటంటే, ఈ నివేదిక ప్రభుత్వానికి చేరిన తర్వాత కూడా రేవంత్‌రెడ్డి పలు సందర్భాల్లో బీఆర్‌ఎస్ నేతల ఫాంహౌస్‌లు ఉన్నాయని ఆరోపిస్తూ 'కూల్చుదామా' అని సవాళ్లు విసిరారు. అక్రమ నిర్మాణాలు ఉన్నవారు సైతం తమవి అక్రమమైతే తామే కూల్చుకుంటామని కూడా ప్రకటించుకున్నారు. కానీ ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయింది. గండిపేట పరిధిలో ఆగస్టు 18న నిర్మాణాలు కూల్చడం మినహా ఆ తర్వాత హైడ్రా అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు.

జగమెరిగిన నిర్మాణాలు నివేదికలో మాయం

జలమండలిశాఖ నిర్వహించిన ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల సర్వేలో పలువురు ప్రముఖుల నిర్మాణాలను ఉద్దేశపూర్వకంగా తప్పించినట్టు తెలిసింది. ముఖ్యంగా మాజీ మంత్రి, తాజా ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి ఫాంహౌస్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందనేది సదరు నిర్మాణాన్ని చూసిన ప్రతి ఒక్కరికీ అర్థమవుతుంది. కానీ, అధికారులు ఉద్దేశపూర్వకంగా ఆ నిర్మాణాన్ని ఎఫ్‌టీఎల్‌లో కానీ, బఫర్‌జోన్‌లో కానీ ఉన్నట్టు పేర్కొనలేదు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఆయన సోదరుడి గృహాలు కూడా బఫర్‌జోన్‌లో ఉన్నాయని స్పష్టంగా తెలుస్తున్నది. అయినప్పటికీ అధికారులు అటువైపు నిర్మాణాలను వదిలివేయడం పలు అనుమానాలకు తావిస్తున్నది. జలమండలి అధికారులు కేవలం ఎఫ్‌టీఎల్, 30 మీటర్ల బఫర్‌జోన్‌ను మాత్రమే పరిగణలోనికి తీసుకోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జంట జలాశయాల ఎఫ్‌టీఎల్ నుంచి 500 మీటర్ల వరకు అంటే అర కిలోమీటరు వరకు ఎలాంటి శాశ్వత నిర్మాణాలు చేపట్టవద్దని స్పష్టమైన పురపాలక శాఖ ఆదేశాలు ఉన్నాయి. అయినా జలమండలి అధికారులు తమ సర్వేలో ఈ ఆదేశాలను పరిగణలోనికి తీసుకోలేదు.

హియాయత్‌సాగర్‌లో అక్రమ కట్టడాల జాబితాలో ప్రధానమైనవి

సర్వే నం/ఎఫ్‌టీఎల్	యాజమాని	అక్రమ కట్టడం
34	జీ వీరశేఖర్‌రెడ్డి, జీవీపీఆర్ ఇంజనీరింగ్ లిమిటెడ్	ప్రహరీ నిర్మాణం
35 టు 39	గోపాలకృష్ణశర్మ	ప్రహరీ నిర్మాణం
60 టు 64	ముజఫర్ అలీఖాన్ అండ్ బ్రదర్స్	ప్రహరీ నిర్మాణం
65	సయ్యద్ ఇక్బాల్	ప్రహరీ, వాచ్‌మెన్ రూం
83	అర్వింద్‌కుమార్(శ్రీనిధి స్కూల్ మెయిన్ గేట్ పక్కన)	ప్రహరీ
86 టు 87	కేటీ మహి, శ్రీనిధి స్కూల్	ప్రహరీ, క్రికెట్ గ్రౌండ్
97 టు 101	కే ఉజ్వల్ అండ్ ఎంఎస్‌ఆర్, సందీప్ (కేవీపీ)	ప్రహరీ
102 టు 103	నామల శ్రీనివాస్	గార్డెన్
104 టు 105	కేవీ రాజువర్మ	గార్డెన్
123 టు 126	అర్వింద్‌రెడ్డి	ప్రహరీ
126టు 127	గాయత్రీస్వరూప్	ప్రహరీడ, వాచ్‌మెన్ రూం
128	వైవీ శ్రీనివాస్‌రెడ్డి, వైవీ సుబ్బా రెడ్డి	ప్రహరీ
129 టు 130	చెన్నమనేని సుజాత	భవనం/ప్రహరీ
130 టు 131	కేటీ మహి	భవనం, కార్మికుల గుడారాలు
139 టు 140	కేటీ మహి రెసిడెన్సీ (ఇల్లు)	గోల్ఫ్ కోర్టు, బంకర్, చిన్న కట్టడాలు, ప్రహరీ (అజీజ్‌నగర్)
140 టు 141	హర్షకుమార్	షెడ్డు, ప్రహరీ
145, 146, 147	ఆర్ సర్వోత్తంరెడ్డి/బీ ప్రవీణ్‌కుమార్‌గౌడ్	8 అక్రమ కట్టడాలు
150, 151, 152	వివేక్	జీ+1 శాశ్వత భవన నిర్మాణం(నాగిరెడ్డిగూడ)
155 టు 159	శ్యామల ఆగ్రో ఫాం	బఫర్‌లో ప్రధాన బిల్డింగ్, ఎఫ్‌టీఎల్ చిన్న కట్టడాలు, ప్రహరీ
160 టు 164	అల్లూరి విష్ణువర్మ	శాశ్వత భవనం, ప్రహరీ
166 టు 169	టీ చిన్నపరెడ్డి	భవనం, ప్రహరీ
170 టు 172	సుశాంక్‌రెడ్డి	భవనం
176	ఎం సాంబశివరావు	బఫర్‌లో ప్రధాన భవనం, ఎఫ్‌టీఎల్‌లో ప్రహరీ
183 టు 185	ఎంవీ కిరణ్‌రెడ్డి, నీలిమారెడ్డి	బఫర్‌జోన్‌లో భవనం
188 టు 191	ఎం సత్తయ్య	ప్రహరీ/బేస్‌మెంట్ నిర్మాణం
228 టు 230	గండ్ర ప్రవీణ్‌రావు	బఫర్‌లో బిల్డింగ్/ఎఫ్‌టీఎల్‌లో ప్రహరీ
335 టు 336	బాతుల స్వామియాదవ్	ప్రహరీ
349	మహిపాల్ రెడ్డి	ప్రహరీ
462 టు 463	చైతన్య మహిళా మండలి రిహాబిలిటేషన్ సెంటర్	షెడ్స్, భవన నిర్మాణాలు
607 టు 610	ఆనంద్ ఫంక్షన్ హాల్/కేశవ్ అగర్వాల్	భవనాలు, షెడ్స్
612	ఇర్ఫాన్ (రిటైర్డ్ జడ్జి) అండ్ గౌస్ పాషా	తాత్కాలిక నిర్మాణాలు

• ముఖ్యమంత్రి ఉత్తమ్!

ఇప్పుడు మంత్రి, కాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి అనే క్యాప్షన్‌తో ఈ ఫొటో సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి త్వరలో సీఎం అవుతారంటూ కామెంట్లు వెల్లువెత్తాయి. సీఎం కావాలన్న కల నెరవేరిందని మంగళవారం రేవంత్‌రెడ్డి విలేకరులతో చిట్‌చాట్ చేసిన తర్వాత ఈ ఫొటో ట్రెండింగ్‌లోకి వచ్చింది. తనది చిన్న వయసని, రాజకీయంగా ఇంకా భవిష్యత్తు ఉందని, అణచివేతతో ప్రజాగ్రహాన్ని మూటగట్టుకోలేనని, ప్రజాస్వామ్యబద్ధంగానే వ్యవహరిస్తానని ఆత్మరక్షణ ధోరణిలో మాట్లాడారు. సీఎం మార్పుపై ఏమైనా సంకేతాలు ఉండటంతోనే ఇలా మాట్లాడారా? అని విశ్లేషకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం కావాలన్న కల నెరవేరింది

- రాజకీయంగా నాకు చాలా భవిష్యత్తు ఉంది
- ప్రజాగ్రహాన్నిమూటగట్టుకోను
- కేసీఆర్‌ను మర్చిపోయేలా చేశా
- ఇప్పుడు కేటీఆర్‌పై హరీశ్‌ను ప్రయోగిస్తా
- జర్నలిస్టులతో సీఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్

హైదరాబాద్, అక్టోబరు 29 (నమస్తే తెలంగాణ): తాను ఫుట్‌బాల్ ప్లేయర్ నని, గేమ్‌ప్లాన్‌పై పూర్తి స్పష్టత ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కావాలన్న తన కల నెరవేరిందని, ఇంతకుమించి పెద్ద కలలు వేరే ఏమీ లేవని తెలిపారు. కొరియా పర్యటనకు వెళ్లి వచ్చిన జర్నలిస్టులతో సచివాలయంలో మంగళవారం రేవంత్ చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయంగా నష్టం జరిగినా ప్రజలకు చేయాలనుకున్న మేలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, విద్యుత్తు కొనుగోళ్లపై విచారణ జరుగుతున్నదని, విచారణ సమయంలో కక్ష సాధింపులు ఉండబోవని, దర్యాప్తు సంస్థల నివేదికల ఆధారంగానే చర్యలు ఉంటాయని తేల్చి చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ నిందితుల పాస్‌పోర్ట్ రద్దయిందని, కాబట్టి అనధికారికంగా విదేశాల్లో ఉండలేరని చెప్పారు. తనది చిన్న వయసని, రాజకీయంగా ఇంకా భవిష్యత్తు ఉందని, అణచివేతతో ప్రజాగ్రహాన్ని మూటగట్టుకోలేనని, ప్రజాస్వామ్యబద్ధంగానే వ్యవహరిస్తానని వివరించారు.

రాజకీయాల్లో నాది ప్రత్యేక స్టైల్

అక్రమ సొమ్ముతో సామాజిక మాధ్యమాల్లో బీఆర్‌ఎస్ విష ప్రచారం చేస్తున్నదని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. సినిమాల్లో రాజమౌళి, రాంగోపాల్‌వర్మ.. ఇద్దరిదీ వేర్వేరు స్టయిల్ అని, రాజకీయాల్లో తన స్టయిల్ తనదని, కేటీఆర్ స్టయిల్ కేటీఆర్‌దని పేర్కొన్నారు. కేసీఆర్ రాజకీయం ఏడాదిలో ముగుస్తుందని తెలిపారు. కేసీఆర్‌ను ప్రజలు మర్చిపోయేలా టార్గెట్ చేసినట్టు చెప్పారు. కేసీఆర్ ఉనికి లేకుండా కేటీఆర్‌ను వాడానని, త్వరలో కేటీఆర్ ఉనికి లేకుండా హరీశ్‌ను వాడతానని, బావను ఎలా హ్యాండిల్ చేయాలో తమకు తెలుసని పేర్కొన్నారు. పోలీసులను పెట్టి వాళ్లను నిర్బంధించవచ్చని, కానీ అది తన విధానం కాదని చెప్పారు. వారు వెళ్లి ప్రజల ఆలోచనను తెలుసుకునే అవకాశం కల్పిస్తున్నానని తెలిపారు. కేటీఆర్ కూకట్‌పల్లి వెళ్లి చిన్నారికి బ్యాగ్ ఇచ్చాడని, తానేమో ఇల్లు ఇస్తాడని అనుకున్నానని ఎద్దేవా చేశారు. స్మార్ట్‌సిటీ, స్పోర్ట్స్ సిటీలను అభివృద్ధి చేస్తామని, రూ. 300 కోట్ల నిధులతో స్కిల్ యూనివర్సిటీని నిర్వహిస్తామని వివరించారు. ఇప్పటి వరకు రూ. 49 వేల కోట్ల అప్పు తెచ్చామని, కేసీఆర్ చేసిన రూ. 56 వేల కోట్ల అప్పు తీర్చామని రేవంత్ వివరించారు.

మూసీపై తగ్గేదేలే

మొదటిపేజీ తరువాయి...

ఎవరు అడ్డుకున్నా మూసీ విషయంలో తాను వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజలను కష్టపెట్టి భూములు తీసుకోబోమని, మూసీ కోసం భూములిచ్చే వారికి వందశాతం సంతృప్తి చెందేలా ప్యాకేజీ ఇస్తామని వివరించారు. బాపూ ఘాట్ నుంచే ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

రూపాయి కూడా ఖర్చు చేయం

మూసీ అభివృద్ధి అధ్యయనానికి నగర ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లను సియోల్‌కు పంపుతామని రేవంత్‌రెడ్డి తెలిపారు. మూసీ పునరుజ్జీవంపై కావాలనే చర్చకు తెరలేపినట్టు తెలిపారు. ఈ చర్చ కారణంగానే మూసీపై ప్రజలకు అవగాహన కలిగిందన్నారు. మూసీ ప్రాజెక్టు ద్వారా పర్యాటకం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. తొలి దశలో బాపూ ఘాట్ నుంచి గండిపేట, హిమాయత్‌సాగర్ వరకు 21 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయనున్నట్టు వివరించారు. ఇందుకు సంబంధించి నెల రోజుల్లో డిజైన్లు పూర్తవుతాయని చెప్పారు. మల్లన్నసాగర్ నుంచి రూ. 7 వేల కోట్లతో నీటిని ఉస్మాన్‌సాగర్‌కు మళ్లిస్తామని, అక్కడి నుంచి హిమాయత్‌సాగర్‌కు పంపుతామని తెలిపారు. ట్రంక్‌లైన్ కోసం వచ్చే నెలలో టెండర్లు పిలుస్తామన్నారు. ప్రతిపక్షాలు రూ.1.5 లక్షల కోట్లు అని విమర్శలు చేస్తున్నాయి కానీ, ప్రభుత్వ నిధుల నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయబోమని, పూర్తి నిధులను ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం నుంచే సేకరిస్తామని చెప్పారు. బాపూ ఘాట్ వద్ద ప్రపంచంలోనే ఎత్తైన గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని, అక్కడే బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మాణం చేపడతామని, ఇందుకోసం ఆర్మీ భూమిని కూడా అడిగినట్టు తెలిపారు.15 రోజుల్లో ఎస్టీపీలకు టెండర్లు పిలుస్తామని, మూసీ వెంట అంతర్జాతీయ యూనివర్సిటీ, గాంధీ ఐడియాలజీ సెంటర్, రిక్రియేషన్ సెంటర్, నేచర్ క్యూర్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని వివరించారు. మూసీని మరొక సిటీగా అభివృద్ధి చేస్తామని, రూ. 141కోట్లతో డీపీఆర్ తయారీకి కన్సెల్టెన్సీతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు చెప్పారు. మూడు నెలల్లోనే నివేదిక వస్తుందని తెలిపారు. మూసీని ఎకో ఫ్రెండ్లీ, వెజిటేరియన్ కాన్సెప్ట్‌తో అభివృద్ధి చేస్తామని వివరించారు. మూసీ వెంట రాత్రి ఏడు గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు మార్కెట్ ఉండేలా ప్లాన్ చేస్తున్నట్టు తెలిపారు. మూసీకి ఎలాంటి ఫైనాన్షియల్ మోడల్ వాడాలో డీపీఆర్‌లో తెలుస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం కేటీఆర్ నుంచి సలహాలు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. కేటీఆర్, హరీశ్‌రావు తమ ప్రతిపాదనలు తెలపాలని కోరారు. సమయం వచ్చినప్పుడు మూసీ పరీవాహక ప్రాంతంలో పాదయాత్ర చేస్తానని, అవసరమైతే వాడపల్లి నుంచి వికారాబాద్ వరకు పాదయాత్ర చేస్తానని తెలిపారు. హైడ్రా వల్ల రియల్ ఎస్టేట్ పడిపోయిందనడం సరికాదని, దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్దత వచ్చిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

డబ్బులిస్తవా.. పదవి తీసేయాలా?

- డబ్బులివ్వాలని అమ్మ ఆదర్శ కమిటీపై కాంగ్రెస్ నేత ఒత్తిడి
- బెదిరించి రూ.1.50 లక్షలు డ్రా
- కలెక్టర్‌కు కమిటీ అధ్యక్షురాలి ఫిర్యాదు

ఫాతిమాబేగం, అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు

మక్తల్, అక్టోబర్ 29: అమ్మ ఆదర్శ కమిటీలో ప్రభుత్వం విడుదల చేసిన డబ్బులను డ్రా చేసేందుకు తీర్మానం ఇస్తావా? లేదా? ఇవ్వకపోతే కమిటీ అధ్యక్షురాలిగా తొలగించేందుకు వెనకాడనని కాంగ్రెస్ నాయకుడు అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలిపై బెదిరింపులకు పాల్పడుతున్నాడు. విద్యార్థులకు వాష్‌రూంలు లేకపోవడంతో కేసీఆర్ సర్కారు హయాంలో నారాయణపేట జిల్లా మక్తల్ మండలం మంతన్‌గోడ్ జడ్పీ ఉన్నత, మండల ప్రాథమిక పాఠశాలకు రూ.7.50 లక్షల చొప్పున నిధులు విడుదలయ్యాయి. కాగా.. జడ్పీ ఉన్నత పాఠశాలలో అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత పాల కృష్ణయ్య వాష్‌రూంలను నిర్మించి రూ.5 లక్షలను మంజూరు చేయించుకున్నారు. బిల్లులు రాకపోవడంతో వాటిని అసంపూర్తిగానే వదిలేశారు. కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన తర్వాత పెండింగ్ పనులు పూర్తి చేయాలని పాఠశాలలకు 3లక్షల చొప్పున నిధులు విడుదల చేశారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో మిగిలిన పనుల కోసం కాంగ్రెస్ నాయకుడు ముందస్తుగానే రూ.1.50లక్షలు కమిటీ అకౌంట్ నుంచి డ్రా చేసుకున్నాడు. మిగిలిన పనులను అసంపూర్తిగా చేపట్టి రూ.1.50 లక్షలను డ్రా చేసేందుకు కమిటీ అధ్యక్షురాలు ఫాతిమా బేగంపై ఒత్తిడి తీసుకొచ్చాడు. దీంతో ఆమె కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రాథమిక పాఠశాల కమిటీ అధ్యక్షురాలు చిట్టెమ్మను సైతం తీర్మానం కోసం ఒత్తిడి తీసుకొస్తున్నట్టు ప్రజలు చెప్తున్నారు.

లచ్చిరెడ్డికి ఏమైంది?

కొత్తగా పోస్టింగ్ ఇవ్వని ప్రభుత్వం

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ లచ్చిరెడ్డి మరోసారి చర్చనీయాంశం అయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆయనకు రెవెన్యూ శాఖలో కీలకమైన పోస్టు కట్టబెట్టింది. ధరణి ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమించింది. ఇటు ధరణి కమిటీ సమావేశాలకు, కొత్త ఆర్వోఆర్ చట్టం రూపకల్పనలో భాగస్వాములు కావడం ద్వారా, అటు డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడిగా ఉద్యోగ సంఘాల్లో హల్‌చల్ చేశారు. సోమవారం పరిస్థితి తారుమారైంది. ప్రభుత్వం ఐఏఎస్‌లు, డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేసింది. ఇందులో సీఎంఆర్వో ప్రాజెక్టు డైరెక్టర్ పదవిని మంద మకరందుకు అప్పగించింది. లచ్చిరెడ్డికి మాత్రం కొత్తగా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

ఫోన్ చేస్తే.. ఎత్తే తీరిక లేదా అన్నా?

- ఎమ్మెల్యే అయినంక మారిపోయిన్రు
- విప్ అడ్లూరి వ్యవహార ధోరణిపై మాజీ సర్పంచ్ కోటయ్య ఆవేదన

మాజీ సర్పంచ్ రాందేని కోటయ్య

జగిత్యాల, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): 'అధికారం ఉన్నా లేకున్నా.. ఎమ్మెల్యే అయినా కాకున్నా.. పదిహేనేండ్ల నుంచి మీ తోటే ఉన్నా.. అన్నాదమ్ముళ్ల లెక్క కలిసి ఉన్నం.. మీరు ఎమ్మెల్యేగా గెలిచినంక మస్తు తుర్తి అయ్యింది నాకు.. మీరు ఎమ్మెల్యే అయినంక మారిపోయిండ్రు.. ఇప్పుడు మీకు నా తోటి మాట్లాడే తీరికే లేదు.. ఫోన్ చేసినా లేపుతనే లేరు.. రెడ్డీలు చెప్పినట్టే నడుసుకుంటుండ్రు.. ధర్మపురి నియోజకవర్గంలో రెడ్డి రాజ్యం నడుస్తున్నది. ఇది మంచిగ లేదు అన్నా' అంటూ జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలోని వెల్గటూర్ మండలానికి చెందిన ఓ మాజీ సర్పంచ్ సెల్ఫీ వీడియో తీసి ధర్మపురి ఎమ్మెల్యే, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు పంపడంతోపాటు సోషల్ మీడియాలో షేర్ చేయగా జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. వెల్గటూర్ మండలం వెంకటాపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ రాందేని కోటయ్య దాదాపు ఐదు నిమిషాలకు పైగా ఉన్న సెల్ఫీ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఆ వీడియో సారాంశం.. 'రెండుసార్లు సర్పంచ్‌గా చేసిన.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నా మీతోనే ఉన్న. ఎమ్మెల్యే కాకముందు తమ్మి కోటయ్య ఎక్కడ ఉన్నవ్ అని ఫోన్ చేసేది. ఇప్పుడా పరిస్థితి లేదు. నియోజకవర్గంలో రెడ్డి వర్గానిదే నడుస్తున్నది. వాళ్లకు భయపడి కావచ్చు.. మీరు మమ్మల్ని పట్టించుకోవడం లేదు. అధికారంలో ఉండి, ప్రజలతో సంబంధాలు ఉన్న బీసీలైన మమ్మల్ని దూరం పెట్టడం కరెక్ట్ కాదన్నా.' అంటూ వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయడం దుమారాన్ని రేపుతున్నది.

బ్యాంక్ గ్యారెంటీ ఇస్తేనే ధాన్యం

సీఎంఆర్‌పై సివిల్ సప్లై కీలక నిర్ణయం

- మిల్లు కెపాసిటీలో 10-25% గ్యారంటీ తప్పనిసరి
- డిఫాల్ట్ మిల్లర్లకు ధాన్యం ఇవ్వొద్దని నిర్ణయం
- మిల్లింగ్ చార్జీలు క్వింటాలుకు రూ. 20 పెంపు
- గడువులోపు సీఎంఆర్ ఇస్తేనే పెంచిన చార్జీలు వర్తింపు
- ప్రతి మిల్లుకు ఒక ఏఈవో కేటాయింపు
- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాముల్లో ధాన్యం నిల్వ
- వానకాలం ధాన్యం కొనుగోలు పాలసీ విడుదల

హైదరాబాద్, అక్టోబర్ 29(నమస్తే తెలంగాణ): సీఎంఆర్ ధాన్యానికి బ్యాంక్ గ్యారంటీ లింకు పెడుతూ పౌరసరఫరాల శాఖ కీలక నిర్ణయం తీసుకున్నది. బ్యాంక్ గ్యారంటీ లేదా సెక్యూరిటీ డిపాజిట్ చేసిన మిల్లర్లకే ధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు వానకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్ల పాలసీని మంగళవారం విడుదల చేసింది. ఈ పాలసీలో ధాన్యం కొనుగోళ్లు, మిల్లులకు ధాన్యం కేటాయింపు, సీఎంఆర్‌పై సంచలన నిర్ణయాలను వెల్లడించింది. డిఫాల్ట్ మిల్లర్స్‌కు ఎట్టిపరిస్థితుల్లోనూ ధాన్యం కేటాయించేది లేదని తేల్చి చెప్పింది. మిగిలిన మిల్లర్లను మూడు క్యాటగిరిలుగా విభజించి వారు సీఎంఆర్ ఇచ్చిన విధానాన్ని బట్టి గ్యారంటీలను నిర్ణయించింది. వాస్తవానికి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కావడానికి ముందే ఈ పాలసీని విడుదల చేయాలి. కానీ ప్రభుత్వం మాత్రం ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించిన 20 రోజుల తర్వాత పాలసీని విడుదల చేయడం గమనార్హం. 'కనీసం ఇప్పటికైనా పాలసీని విడుదల చేశారు. అధికారుల తీరు చూస్తే ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాక పాలసీ ఇస్తారేమో అనుకున్నాం' అంటూ ఓ మిల్లర్ ఎద్దేవా చేయడం గమనార్హం.

బ్యాంకు గ్యారెంటీ లేదా సెక్యూరిటీ డిపాజిట్

సీఎంఆర్‌లో ఎలాంటి జాప్యం లేకుండా బియ్యం ఇచ్చిన మిల్లర్లకు వారి మిల్లింగ్ కెపాసిటీలో మద్దతు ధర ఆధారంగా 10శాతం బ్యాంక్ గ్యారంటీ లేదా 25శాతం సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి. గతంలో సీఎంఆర్ పెండింగ్‌లో ఉండి పెనాల్టీతో క్లియర్ చేసిన మిల్లర్లు 20 శాతం బ్యాంక్ గ్యారంటీ లేదా 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించాలి. పెండింగ్ సీఎంఆర్ క్లియర్ చేసి 25శాతం పెనాల్టీ పూర్తి చేయని మిల్లర్లు పెండింగ్‌లో ఉన్న పెనాల్టీ ధాన్యానికి 25శాతం బ్యాంక్ గ్యారంటీ ఇవ్వాలి. అదే విధంగా మిల్లింగ్ కెపాసిటీలో 25 శాతం అధనంగా మరో బ్యాంక్ గ్యారంటీ ఇవ్వాల్సి ఉంటుంది.

గడువులోగా సీఎంఆర్ ఇస్తేనే చార్జీల పెంపు

మిల్లింగ్ చార్జీలు పెంచాలని మిల్లర్లు డిమాండ్ చేసిన నేపథ్యంలో ప్రస్తుతం సన్న, దొడ్డు రకాల బియ్యానికి క్వింటాలుకు రూ.10 ఉండగా, దీన్ని దొడ్డురకానికి రూ.30, సన్నరకానికి రూ.40కి పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. మిల్లర్లు మాత్రం క్వింటాలుకు రూ.150 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మాత్రం మిల్లర్ల డిమాండ్‌కు తగ్గట్టుగా మిల్లింగ్ చార్జీలను పెంచకపోగా పెంచిన ఆ చార్జీల అమల్లోనూ మెలిక పెట్టింది. ఎఫ్‌సీఐ ఇచ్చిన గడువులోగా ఇచ్చిన సీఎంఆర్‌కు మాత్రమే పెంచిన మిల్లింగ్ చార్జీలు వర్తిస్తాయని స్పష్టం చేసింది.

సన్నధాన్యం పంచాయితీ తేల్చేది ఏఈవోలే

సన్నధాన్యం గుర్తింపు, కొనుగోలులో ఎదురయ్యే సమస్యల పరిష్కార బాధ్యతలను ఏఈవోలకు అప్పగించింది. సన్న ధాన్యంపై ఏమైనా అభ్యంతరాలుంటే సదరు మిల్లర్లు ఆన్‌లైన్ ద్వారా 48 గంటల్లో ఫిర్యాదు చేయాలని పేర్కొన్నది. ఆ తర్వాత 24 గంటల్లో ఏఈవోలు వారి సమస్యను పరిష్కరిస్తారని సూచించింది. సన్న ధాన్యంలో ఇబ్బందులను పరిష్కరించేందుకు ప్రతి మిల్లుకు ఒక ఏఈవోను కేటాయించింది. ఒకవేళ ఏఈవో నిర్ణయంపై మిల్లర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తే జిల్లా స్థాయిలో రెండు కమిటీలను ఏర్పాటు చేసింది.

గోదాముల్లోని ధాన్యానికి డీఎంలదే బాధ్యత...

రైతుల నుంచి కొనుగోలు చేసే ధాన్యాన్ని మిల్లులతో పాటు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాముల్లోనూ నిల్వ చేయాలని నిర్ణయించింది. గోదాముల్లో నిల్వ చేసిన ధాన్యం పర్యవేక్షణ బాధ్యతను జిల్లా అడిషనల్ కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్(డీఎం)కు అప్పగించింది. ఒకవేళ గోదాముల్లో నిల్వ చేసిన ధాన్యం పాడైనా, కొత(షార్టేజ్) ఏర్పడినా, నాణ్యత దెబ్బతిన్నా అందుకు పూర్తి బాధ్యత డీఎందేనని స్పష్టం చేసింది.

బ్యాంకు గ్యారంటీ ఇవ్వలేం.. ధాన్యం దించుకోం

- రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గణపతిరెడ్డి
- నిబంధనలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి లేఖ

హైదరాబాద్, అక్టోబర్ 29(నమస్తే తెలంగాణ): సీఎంఆర్, ధాన్యం కొనుగోళ్ల పాలసీలో ప్రభుత్వం పెట్టిన నిబంధనలపై రైస్ మిల్లర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏకపక్షంగా రూపొందించిన పాలసీలో భాగస్వామ్యం కాలేమని స్పష్టంచేస్తున్నారు. ఈ పాలసీని, నిబంధనలను వ్యతిరేకిస్తూ రాష్ట్ర రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ నిబంధనల ప్రకారం సన్న ధాన్యం ప్రొక్యూర్‌మెంట్ పాలసీలో, సీఎంఆర్‌లో భాగస్వామ్యం కాలేమని అసోసియేషన్ అధ్యక్షుడు గణపతిరెడ్డి లేఖలో పేర్కొన్నారు. కొత్త పాలసీతో రా రైస్ మిల్లింగ్ ఇండస్ట్రీ తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ సమస్యలు పరిష్కరిస్తేనే పాలసీలో భాగస్వామ్యం

- సన్న బియ్యం అవుట్ టర్న్ రేషియో తగ్గించాలి. లేదా క్వింటాలుకు రూ. 300 పరిహారం చెల్లించాలి.
- మిల్లింగ్ చార్జీలు క్వింటాలుకు రూ. 150 చెల్లించాలి.
- సన్న ధాన్యాన్ని 17శాతం తేమతో కాకుండా 14శాతం తేమతో ఇవ్వాలి.
- సన్న బియ్యం పెట్టడానికి కొత్త గన్నీ బ్యాగులను ఇవ్వాలి.
- ఇతర పాత బకాయిలను వెంటనే చెల్లించాలి.